# ఎయిర్ కూలర్

## –వి.పి.బి.నాయర్

ఆమె పేరు ఊర్మిళ. రామాయణంలోని ఊర్మిళకు పధ్నాలుగు సంవత్సరాలపాటు కుంభకర్ణసేవ చేసినట్లు ఒక చెడ్డపేరు వుంది. కానీ ఈ ఊర్మిళ అలాంటిది కాదు. నిద్రపోతుందిగానీ రోజుల తరబడి నెలల తరబడి, సంవత్సరాల తరబడి కాదు, కొన్ని గంటలు మాత్రమే. కానీ అది ఒళ్లెరుగని నిద్ర. దానిని ఇంగ్లీష్‌లో సౌండ్ స్లీప్ అని అంటారు. సౌండ్ అంటే శబ్దం. స్లీప్ అంటే నిద్ర. అంతవరకూ అక్షరాల నిజమే!

ఊర్మిళ నిద్రకు తోడుగా ఒక శబ్ద విశేషం ఉంటుంది. అయ్యో! ఒక శబ్ద విశేషమేనా? అదే అయితే అంత పెద్ద సమస్య లేదుగా. ఆమె గురక నాలుగైదు రకాల శబ్దాల సమ్మేళనం. ఆ శబ్దాల మధ్య సరైన స్వరాల పొందిక కూడా ఉండదు. ఆ శబ్దాలకి ఆరోహణా అవరోహణాక్రమాలేవీ లేవు. ఏకతాళం, త్రిపుటతాళం, ఆటతాళం, విటతాళం లాంటి తాళాలకేమీ కూడా ఆ గురక పరిమితంకాదు. దాని తాళం ఒక మిశ్రతాళం. అప్పుడప్పుడు గేర్ ఛేంజ్ అవుతుంది.

ఆ గురకకి మంద్రస్థాయి, మధ్యమస్థాయి, తారాస్థాయి కాక ఆమె గురకకి చంద్రస్థాయి అనే ప్రత్యేక స్థాయి కూడా వుండేది. పున్నమినాడు కొందరికి పిచ్చెక్కుతుందని అంటారుకదా! అలాగే ఈమె చంద్రస్థాయి గురక వింటే ఆమె భర్త కోదండరెడ్డికి పిచ్చెక్కుతుంది.

అది వారి మొదటి రాత్రేనా?

వారి మొదటి రాత్రి- ఊర్మిళ బిపిఎల్ వారి ఫోర్ డోర్ ఫ్రాస్ట్ ఫ్రీ ఫ్రిజ్‌లాగా సైలెంట్‌గా ఉండేది. కానీ ఊర్మిళ పరిమాణం దానికన్నా తక్కువేనా? అయిదడుగుల అయిదంగుళాల ఎత్తు, దానికి తగ్గ లావు వున్న ఆమెకి. భీముడికే వంట చేసే శరీర సామర్థ్యం ఉన్నట్టేకదా! ఆమెని ఫ్రిజ్‌తో పోల్చడంలో దురుద్దేశ్యమేదయినా ఉందా? ఏమిటి ఆమె ఫ్రిజిడా? అయ్యో అలా అపార్థం చేసుకోకండి. ఇద్దరు మగపిల్లలకి, ఇద్దరు ఆడపిల్లలకి జన్మనిచ్చిన ఒక స్త్రీని ఫ్రిజిడి అని వర్ణించే ఆమె భర్తకి మాత్రమే పరిమితం, సమంజసం. ఫ్రాస్ట్‌ఫ్రీ అని వర్ణించడంలో నిగూఢార్థమేదయినా ఉందా? లేదు. ఆడవాళ్లందరూ ఫ్రాస్ట్ ఫ్రీగానే ఉంటారు. మానవ శరీరంలో తొంభై శాతం వరకు జలాంశమేనని పిచ్చికుక్కలు తప్ప మిగతా అందరూ అంగీకరిస్తారు. మరి ఫోర్‌డోర్స్ అని ఎందుకన్నారు? ఇంతేనా, ఇంకా ఏమైనా ప్రశ్నలున్నాయా? బిపిఎల్ అంటే ఏమిటని అడగరా? భార్యని పోలిన లావణ్యవతి అని చెబితే చాలామంది భార్యలకు నచ్చుతుంది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే మొదటి రాత్రి ఊర్మిళ చాలా సైలెంట్‌గా ఉన్నదని, ఒకవేళ ఆమె గాఢ నిద్రా సమయాన చిన్నగా ఏదయినా అపస్వరం వచ్చినా ఆమె మొదటి వివాహపు మొదటి రాత్రి, మొదటి భర్త అయిన కోదండరెడ్డి ప్రతిస్పందన అనుకూలంగా వుండడానికి వీల్లేదు. పాపం, ఆమె గతి కొద్దిరోజులుగా నిద్ర పోలేదేమో. తన ఆజానుబాహు వలయంలోని సురక్షిత భావన ఆస్వాదిస్తూ సర్వం మరచి ఆమె ఒక చిన్న పాపలా నిదురపోతోందని అతను భావిస్తాడు. లేకపోతే ఆమె జీవితంలో ఇదే మొదటి రాత్రి కావచ్చు. ఒక పురుషుడి బలం, ఆవేశం ఈమె మొదటిసారిగా రుచి చూసిందేమో...నేనంత తక్కువవాణ్ణేమీ కాదుకదా! పాపం చాలా అలసిపోయి నిద్ర పోతుందేమో అని తనలో తాను గర్విస్తాడు.

''ఈమె తండ్రి గూర్ఖాలా పొట్టివాడు కదా! అందుకే అతనికి గుర్క రక్తమేమయినా ఈమెలో కలిసిందేమో! అందుకే ఈమె గురక మొదలుపెట్టిందేమో'' అని కూడా అతను ఆలోంచి వుండడు.

ఏమయినా కోదండరెడ్డికి ఊర్మిళ నిద్రపట్ల ఎలాంటి కంప్లయింట్ వుండేదికాదు. వాళ్లిద్దరూ కలసి భోజనం చేయడంవలన కలసి నిద్రపోవడంవలన వాళ్లకు 'నాకిద్దరు నీకిద్దరు' అనే స్కేలులో వాళ్లకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు పుట్టారు. ఇద్దరమ్మాయిలూ అమెరికాలో పని చేస్తున్న ఇద్దరు ఇంజనీర్స్‌ని పెళ్లి చేసుకున్నారు. కొడుకుల్లో ఒకడు ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. రెండోవాడు చదువులో అంతగా రాణించకపోయినప్పటికీ ఎలాగో బికామ్ దాటి ఫ్రెండ్స్‌తో కలిసి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు.

నలుగురు పిల్లలకీ పెళ్లిళ్లు అయ్యాయి. ఆ రియల్ ఎస్టేట్ కొడుకు తల్లీ తండ్రే దగ్గర వుంటున్నాడు.

నలుగురు పిల్లలకీ మంచి చదువులు చెప్పించి పెద్ద వాళ్లని చేయాలంటే ఊర్మిళ కోదండ దంపతులకు బాగానే ఖర్చయి వుంటుంది. వాళ్ల ఆర్థిక పరిస్థితి కూడా బాగానే వుండుండాలి.

నిజానికి బాగాలేదు. వారికి నలుగురు పిల్లలు కావాలని వుండేది కాదు. వివాహానంతరం సప్త వసంతాల లోపల ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. ఒక క్యూ నుంచి వచ్చినట్లు బయటపడ్డారు. తమ కాస్టలీ మిస్టేక్ గురించి తెలుసుకునేసరికి చాలా లేటయిపోయింది. పుట్టేసిన పిల్లలకి ఫామిలీ ప్లానింగ్ వర్తించదు కదా! అందుకే ఆ పిల్లలకి తమ శక్తి సామర్థ్యాలన్నిటినీ వెచ్చించి మంచి చదువులు చెప్పించాలని స్నేహనిధులైన ఆ తల్లిదండ్రులు సిద్ధపడ్డారు. పెళ్లినాటికి కోదండరెడ్డి రోడ్స్ అండ్ బిల్డింగ్స్ విభాగంలో జూనియర్ ఇంజనీర్. నలుగురు పిల్లల భాగ్య జాతకాల కారణంగా అతను అసిస్టెంట్ ఇంజనీర్ కాగలిగాడు. అతికష్టంమీద నలుగురికీ ఇంగ్లీష్ మీడియంలో చదువులు చెప్పించాడు. వారి వివాహాలు కూడా ఘనంగా జరిపించేసరికి కోదండరెడ్డి వయసు యాభై అయిదు, ఊర్మిళ వయసు యాభై. ఈ లోపల రెడ్డిగారు మెయిన్‌రోడ్డు మీద తనకొక స్వంత ఇల్లు కట్టుకున్నారు. ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లకి దొరికినచోటల్లా అప్పులు చేసినాగానీ మగపిల్లలిద్దరి పెళ్లిళ్లతో ఆ అప్పులు కూడా తీరిపోయాయి.

ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వచ్చే జీతంతో ఒక మోస్తరుగా ఆ కోదండ కుటుంబం సాఫీగా జీవితం గడుపుతున్నారు. చిన్న కొడుకు, కోడలు ఆ ఇంట్లోనే ఉంటారుగానీ వాళ్లకై తాము ప్రత్యేకంగా ఖర్చుపెట్టే అవసరంలేదు. పైపెచ్చు వాళ్లవల్లే చిల్లరమల్లర ఖర్చులు గడిచిపోతుండేవి. అందుకుతోడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో ఒక ప్రభుత్వ జీపు అమరడంవలన బస్సు చార్జీలు, ఆటో ఖర్చులు కూడా తప్పాయి. అదీగాక చిన్నకోడలితోపాటు చిన్న మారుతీ కూడా గృహ ప్రవేశం చేసింది.

ఈ విధంగా రిటైర్‌మెంట్‌కు మూడు సంవత్సరాల కాలం మిగిలున్నప్పుడు- ఆ గురకకాండం మొదలైంది.

''ఊర్మిళా! నేను సరిగ్గా నిద్రపోయి నాలుగైదురోజులయింది. నీ గురకని పూర్తిగా ఆపలేకపోయినా దాని శబ్దం కాస్త తగ్గించకూడదా?'' అని దయనీయమైన స్వరంతో అడగకుండా ఉండలేకపోయాడు కోదండం.

''ఏమిటీ? నేను గురక పెడుతున్నానా? గత ముప్పై సంవత్సరాల్లో మీరెప్పుడూ ఇటువంటి కంప్లైంట్ చేయలేదే? కానీ అప్పుడప్పుడు మీరు భలే గురక పెడతారు. అది కూడా బాగా తాగొచ్చినప్పుడు. కానీ మిమ్మల్ని పక్కకి ఒత్తిగిల్లిస్తే ఆ గురక ఆగిపోతుంది. కానీ నాకలాంటి జబ్బేమీలేదు. ఎప్పుడో ఒకసారి జలుబుచేసి ముక్కు దిబ్బడేసినప్పుడు కాస్త శబ్దం రావచ్చు. దాన్ని గురక అని పిలవనక్కరలేదు''

''అదికాదు ఊర్మిళా! పోయిన వారం నుంచి నీ గురక ఆగకుండా సాగుతోంది. విపరీతమైన శబ్దం కూడా. నిన్ను అటూ ఇటూ కదిలించి లేపి చూశాను. నీకు ఒళ్లు తెలియలేదు. సుఖంగా నిద్రపోవడం మంచి ఆరోగ్య లక్షణమే. దేవుడి దయవలన నీకు మంచి ఆరోగ్యం వుంది. కానీ ఇది ఇలాగే కొనసాగితే నా ఆరోగ్యం సంగతేంటి? నిన్న రాత్రి నాకు పిచ్చెక్కినట్టయ్యింది''

''ఓహ్! పిచ్చెక్కడానికి మీకు ప్రత్యేకంగా రాత్రిళ్లే కావాలనిలేదే''

''ఊర్మిళా! ఇది తమాషా కాదు. నేను చాలా సీరియస్‌గా చెబుతున్నాను. రాత్రిళ్లు నిద్ర లేకుండా ఇలా గడపడం నావల్ల కాదు''

''దీన్ని ఒక పెద్ద సమస్యగా చేయవద్దు. నేనే వేరే గదిలో పడుకుంటాను''

''కానీ ఊర్మిళా! నువ్వు నా దగ్గర లేకపోతే నాకు నిద్ర వస్తుందని అనుకుంటున్నావా?''

''ఇది మరీ బాగుంది. నేను దగ్గరున్నా మీకు నిద్ర రాదు. దూరంగా వున్నా నిద్ర రాదు. ఇక నన్నేం చేయమంటారు?''



''నువ్వు కొంచెం ప్రయత్నించి చూడు. కొంచెం సెల్ఫ్ కంట్రోల్ ఉంటే గురకని కాస్త తగ్గించవచ్చు. మెలకువగా వున్నప్పుడేకాదు, నిద్ర పోతున్నప్పుడు కూడా కొద్దిగా సెల్ఫ్ కంట్రోల్ ఉండాలి.''

''అది జరిగే పని అని నాకు అనిపించడంలేదు. నిజంగా నేను ఎక్కువ గురక పెడుతున్నానని అంటే మీరు ఒక డాక్టర్‌ని సంప్రదించకూడదా? అతనేదయినా పరిష్కారం చూపిస్తాడు''


''ఛీ...ఛీ! నేను డాక్టర్‌ని కలసి నా భార్య గురక కారణంగా నాకు నిద్ర పట్టడంలేదని ఎలా చెప్పమంటావు?''

''అయ్యో! మీకామాత్రం జ్ఞానంలేదా! డాక్టర్‌ని కలిసినప్పుడు మీ గురక వల్ల నాకు నిద్ర పట్టడంలేదని చెప్పకూడదా?''

''డాక్టర్ నా ముక్కుని పరీక్షించి చిన్న ఆపరేషన్ చేయాలని చెబితే? అయినా నాకు తెలిసినంతవరకూ గురకకి మందులేమీ లేవు''

ఈ ప్రకారమైన సంభాషణా తీక్షణతవల్ల ఊర్మిళ విడాకులకి కూడా సిద్ధపడే స్థాయికి వచ్చింది. అప్పుడప్పుడు ఆమె గురక శబ్దం కాస్త తగ్గినట్టు ఆయనకి అనిపించేది. కానీ అతను మద్యం సేవించిన రాత్రులలో ఆ గురక శబ్దం వినిపించేదే కాదు. అందుకే ప్రతి రాత్రీ అతను మద్యం సేవించడం మొదలుపెట్టాడు. ఊర్మిళకి ఆ విషయంలో పెద్దగా అభ్యంతరమేమీ వుండేదికాదుకానీ కోదండరెడ్డికి మందుపై ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడం ఇష్టముండేదికాదు.

ఒకరోజు ఆఫీసులో హఠాత్తుగా అతనికి జ్ఞానోదయం కలిగింది. ఆ పాత ఆఫీసులో ఒక పాత ఫాను కింద ఒక కొత్తజ్ఞానం ఉదయించిందన్నమాట. తలమీద తిరుగుతున్న ఫాన్ చేసే కరకర శబ్దం అతనికి చాలా చిరాకు పుట్టిస్తుంది. మామూలుగా మధ్యాహ్నాలు నిద్రపోవడం ఇష్టంలేని ఆ ఇంజనీరుకు ఒక్కొక్కరోజు భోజనానంతరం కుర్చీలో అలా వెనక్కి వాలి కళ్లు మూసుకుని పది పదిహేను నిముషాలపాటు అర్ధ బోధావస్థలో ఉండడం అంత అరుదేమీ కాదు. ఆ రోజు అలాంటి ఒక అర్ధసుషుప్తి నుంచి తుళ్లిపడి లేచేటప్పుడు ఆ జ్ఞాన ప్రకాశం అతని మస్తిష్కానికి ఒక అయిదువందల వాట్ల ఉత్తేజనం కలిగించింది. ''ఈ ప్యాన్ ఇంత రొద పెడుతున్నా నా నిద్రకి అది విఘ్నం కాదే? ఏ శబ్దమయినా ఒకే రకంగా అంటే అప్పుడప్పుడు గేర్ మారుస్తున్నట్లు కాకుండా స్థాయి మారకుండా ఒకే శృతిలో వింటూంటే




అది నిద్రాభంగం కలిగిందేమో''

ఇక అతను సమయం వృథా చేయలేదు. పగటి కలలు కంటూ నిద్రపోతున్న జీపు సారథిని మేల్కొల్పాడు. జీపు వెళ్లి ఆగింది. ఒక ఎయిర్‌కూలర్ షాపు ముందు. రకరకాల ఎయిర్‌కూలర్లని పరీక్షించి కోదండం ఒకటి సెలెక్ట్ చేసుకున్నాడు.

''సార్! మీకు ఇది బెడ్‌రూమ్‌కి కావాలన్నారుకదా! దీని ఫ్యాన్ సైజు పెద్దది కావడంవల్ల శబ్దం కూడా ఎక్కువ వస్తుంది. దీని తరువాత సైజు అయితే స్వీప్ ఇంతే వుంటుందిగానీ శబ్దం తక్కువగా వస్తుంది'' అని షాపువాడు చెబుతుండగా

''ఒరేయ్ బ్లడీఫూల్! నేను ఇది ఎందుకు కొంటున్నానో నీకే కాదు. నీ బాబుకి కూడా అర్థంకాదు'' అని అతనికి చెప్పాలనిపించింది. కానీ ''ఇదే నాకు కావాలి'' అని దాని ఖరీదు చెల్లించేశాడు. ఆ షాపు నుంచి ఒక మెకానిక్కుని కూడా తీసుకువెళ్లి తన ఇంటి బెడ్రూమ్ కిటికీలో ఆ న్యూసెన్స్ యంత్రాన్ని అమర్చినప్పుడు అతనికి ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినంత ఆనందం కలిగింది.

అరవ సినిమాల్లో ఆద్యంతం వినిపించే శబ్దాల గొడవ, ఆ చలువ పెట్టె నుంచి అనవరతంగా రావడం గమనించి

''ఇంత పెద్ద శబ్దం వింటూ ఎవరైనా నిద్రపోగలరా?'' ఊర్మిళ అడిగింది. ఏదో ఆలోచనలో మునిగి వున్న కోదండం వెంటనే జవాబేమీ ఇవ్వలేదు.

''ఇంత పెద్ద చప్పుడు కాదే, పిడుగు పడుతుంటే కూడా నిద్రపోవచ్చే. వర్షాకాలంలో ఉరుములు, మెరుపులు వుంటే జనం సుఖంగా నిద్రపోతారే. కానీ నువ్వు దగ్గరుంటే ఇంకెవ్వరికీ నిద్ర వస్తుందో రాదో నాకు తెలియదు కానీ నాకు మాత్రం నిద్ర రాదు. ఒక్కొక్క రాత్రి నాకు కోపం ఎక్కువై అదికోపం కాదు కానీ భరించలేనట్టయ్యి నేను నిన్ను గిల్లడం, తిట్టడం, పిడికిలితో కొట్టడం... ఇలాంటివన్నీ ప్రయోగం చేసి చూశాను. నీకు ఎక్కువ నొప్పి అనిపించినప్పుడు కలవరింతగా విసుక్కుంటావుకానీ, నీ న్యూసెన్స్ అలా కొనసాగుతూనే వుంటుంది. మళ్లీ మళ్లీ నిన్ను నేను శొప్పిస్తే నువ్వు లేచి కూర్చుని నన్ను తిట్టి మళ్లీ కొద్దిక్షణాల్లో నీ కచేరి సాగిస్తావు. పిచ్చివాళ్లు కూడా రాత్రుళ్లు సుఖంగా నిద్రపోతారే. వాళ్లు పగలు కాల్చుకు తింటారుగానీ, రాత్రిళ్లు కమ్మగా నిద్రపోనిస్తారు. కానీ నువ్వు రాత్రుళ్లు నన్ను పిచ్చివాడిని చేస్తున్నావు. దీనికేమిటి పరిష్కారం? ఈ జబ్బుకేమిటి మందు? ఎలాంటి నివారణలేదా? కనీసం మెనోపాజ్ తరువాతనయినా ఇది ఆగుతుందా? ఇది ఆగడానికి ఎంతకాలం పడుతుంది? ఇది ఆగేవరకు నేనేం చేయాలి? దీర్ఘాలోచనలో పడింది కోదండం భార్య మళ్లీ అదే ప్రశ్నని అడగడంతో.

''దీని చలిగాలికి నువ్వు నిండా ముసుగుతన్ని నిద్రపోవచ్చు. తల కూడా కప్పుకోవడంవల్ల ఆ సౌండ్ కొంచెం తగ్గుతుందేమో. అప్పుడు నేను కూడా కాస్త నిద్రపోగలను'' అని ఒక చిరునవ్వుతో అతను చెప్పాడు.

ఆ చిరునవ్వు ఊర్మిళలో మరొక చిరునవ్వుకు దారి తీయలేదు

''అయితే ఇది నా గురకకి విరుగుడా?''

కోదండం బిగ్గరగా నవ్వి ''అలాగే అనుకో'' అన్నాడు.

ఆ రాత్రి చాలాసేపు వారిద్దరికి నిద్ర రాలేదు. కానీ ఒకసారి నిద్ర పట్టిన తరువాత వారు మర్నాడు ఉదయం ఆలస్యంగా లేచారు. రాత్రంతా చాలా చలి వేసింది. ఆ వేసవికాలంలో కూడా వారికి బ్లాంకెట్ వాడాల్సి వచ్చింది. కొన్నిరోజుల్లో వాళ్లకి ఆ కూలర్ గోల అలవాటయిపోయింది.

మన ఎలక్ట్రిసిటీ బోర్డు సంగతి మీకు తెలుసుకదా! కరెంటు కోతవల్ల కొంతసేపు అవస్థపడితే వారి కోతి పాలసీవల్ల మిగతా సమయం కూడా అవస్థే.

కోదండరెడ్డిగారి ఇంజనీరు బుర్రలో దానికి జవాబుగా ఒక ఉపాయం తట్టింది. అది సిల్లీ కావచ్చుగానీ సుగమం, ప్రాయోగికం.

ఒక టేపులో కూలర్ శబ్దం రికార్డు చేసి పెట్టండి. కరెంటు లేనప్పుడు బ్యాటరీతో పని చేసే టేప్ రికార్డర్ ఆన్ చేయండి. అది గంటన్నరసేపు పని చేస్తుంది. ఆ లోపల కరెంటు తిరిగి రావచ్చు. ఒకవేళ రాకపోయినా మంచి నిద్రలో వుంటే తెల్లారే వరకూ ఆ నిద్రకు భంగం కలగకుండా ఉండవచ్చు కదా!

★★★

చివరగా కోదండోపదేశం- మరేమీ కొత్త కాదు ప్రియమైన స్త్రీ పురుష పాఠకుల్లారా! మీ పక్కన శయనిస్తున్న వ్యక్తి పెట్టే ఆ గురకవల్ల మీ జీవితాలు దుర్భరమైతే ఈ కూలర్ టెక్నిక్ ఒకసారి ప్రయోగించి చూడండి. ఒక గదిలో ఇద్దరికంటే ఎక్కువుంటే కూడా ఇబ్బంది వుండదు. అయితే అది ఒక లాభసాటి బేరమే అవుతుంది. ఒక్క కూలర్ చాలు. మీ బెడ్‌రూమ్‌లో ఏ శబ్దమూ చేయని ఎయిర్ కండిషనర్ వుంటే అది తీసి పారెయ్యండి. దానికి బదులుగా ఒక ఎయిర్ కూలర్‌ని ప్రతిష్ఠించండి. తరువాత మీరు సుఖంగా నిద్రపోవచ్చు. కరెంటు బిల్లు వచ్చేటప్పుడు మీకు హైబిపి రాదు కూడా!

☆



## మనీషా సెక్యూరిటీ!

నేపాలీ అమ్మాయే అయినా భారతీయ వనితలానే కనిపించే మనీషా కొయిరాలా కుటుంబ సభ్యులు నేపాల్ దేశ రాజకీయాల్లో చాలా కాలంగా కీలక పాత్ర నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రధాని కూడా మనీషాకి బాగా కావల్సిన వాళ్లు కావడంతో-ఇప్పుడు మనీషాకి సెక్యూరిటీ సమస్య ఎక్కువైందిట. ఆమె ఏ చిత్రం షూటింగ్‌లో వున్నా ఫుల్ సెక్యూరిటీ కనిపిస్తోందని బాలీవుడ్ సినీ వాలాలు చెప్పుకుంటున్నారు. ఆమెతో చిత్రాల్ని తీస్తున్న బాలీవుడ్ నిర్మాతా దర్శకులకు ఇదొక తలనొప్పిగా తయారైందిట. అసలే షూటింగులు చాలా నిదానంగా అవుతుంటాయి. వాటికి మరింత బ్రేకులాగా ఈ సెక్యూరిటీ సిబ్బంది, గట్రాలు...! తారలతో పాటు కుటుంబ సభ్యులు రావడం మామూలే! ఇప్పుడు మనీషా లాంటి తారల పుణ్యమాని కుటుంబ సభ్యులే కాకుండా ఇలాంటి రక్షణ దళాల్ని కూడా ఆయా నిర్మాతలు భరించాల్సి వుంటుందన్నమాట.

-జె.ఎం.